క్లుప్తంగా

2285 హెక్టార్లలో పంట నష్టం

కొమరోలు: మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో 2285 హెక్టార్లలో రైతులు పంటలు నష్టపోయినట్లుగా మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ తెలిపారు. మండలంలో రబీ సీజన్‌లో శనగ పంటను 2957 మంది రైతులు 2220.97 హెక్టార్లలో పంట నష్టపోయారని, 2,22,09,700 రూపాయల మేర నష్టం వాటిల్లిందని వివరించారు. 124 మంది మినుము రైతులు 64.68 హెక్టార్లలో పంట నష్టపోయారని, రూ.6,46,800 రూపాయల మేర పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేసి పరిహారం కోసం జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు ఏఓ పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న పంట బీమా గడువు


ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: పంటల బీమా గడువు డిసెంబర్ 31తో ముగుస్తున్నట్లు మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని వేములకోట గ్రామంలో రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. రబీ 2024–25లో రైతులు సాగుచేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. వీఏఏ మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

8 మంది జూదరులు అరెస్టు

రాచర్ల: మండలంలోని రంగారెడ్డిపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హిందువులు ఐకమత్యంతో మెలగాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న హిందువులు

గిద్దలూరు రూరల్: హిందూవులు ఐకమత్యంతో మెలగాల్సిన ఉందని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హైందవ శంఖారావం కార్యక్రమంపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులు తరలి రావాలని కోరారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైందవ శంఖారావం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పిడత రమేష్‌రెడ్డి, విశ్వ హిందూ పరిషత్ నిర్వాహకులు బూజుమేకల రాజు, యర్రారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాయత్రి మాత ఆలయంలో సోమవారం నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ సోమవారం అమావాస్య అరుదుగా వచ్చిందన్నారు. ఈ అమావాస్య రోజు ప్రతి ఒక్కరు భగవంతుడిని శ్రద్ధతో పూజించాలన్నారు. గాయత్రి యజ్ఞం వల్ల సకల దోషాలు తొలగిపోతాయన్నారు. మానవుడిలో దాగి ఉన్న మంచి గుణాలను వెలికి తీసేందుకు ఆధ్యాత్మిక మార్గం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం నాయకులు టి.ఆవులయ్య పేర్కొన్నారు. మండలంలోని ముండ్లపాడు, నరవ, బయనపల్లె, గ్రామాలల్లో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంట పొలాలను సోమవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శనగ, మినుము పంటలను వారు పరిశీలించారు. రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎకరాకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాదర్‌రెడ్డి, నారాయణ, థామస్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పని భారం.. వేతనం ఘోరం!

- పొదిలిలో పారిశుధ్య కార్మికులపై పని భారం
- పట్టణ పంచాయతీలో అవసరమైన కార్మికులు 180 మంది
- పనిచేస్తున్నది 70 మంది మాత్రమే..
- వారిలోనే మేస్త్రీలు, ఇతర పనులకు..
- ఇంజినీరింగ్ కార్మికులకు అత్తెసరు వేతనం
- అమలుకు నోచుకోని ఒప్పందాలు


చెత్త ఎత్తుతున్న కార్మికులు

పొదిలి: పాండవులు మంచం కోళ్ల వలే ముగ్గురు అని రెండు వేళ్లు చూపించిన చందంగా ఉంది పొదిలి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఖ్యా వ్యవహారం. ఇక్కడ జనాభాకు అనుగుణంగా మొత్తం 180 మంది వరకు పనిలో ఉండాలి. కానీ కేవలం 70 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ముగ్గురు మృతి చెందగా.. మిగిలిన వారిలో 15 మంది మేస్త్రీలు ఉన్నారు. ఒకరు నగర పంచాయతీ కమిషనర్ ఆఫీసులో సేవలందిస్తున్నారు. రోజూ వివిధ కారణాలతో ముగ్గురు లేదా నలుగురు సెలవులో ఉంటున్నారు. మొత్తం మీద క్షేత్ర స్థాయిలో 50 మంది మాత్రమే పని చేస్తున్నారు. వాస్తవానికి 180 మంది చేయాల్సిన పనిని ఈ 50 మంది మాత్రమే చేయాల్సి వస్తోంది. అంటే ముగ్గురు చేయాల్సిన పనిని ఒకరే చేయాల్సి వస్తోంది. పనిభారం అధికం కావడంతో సాయంత్రానికి ఒళ్లు హూనమవుతోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో కంప్యూటర్, నీటి సరఫరా, విద్యుత్ తదితర పనులను 13 మంది కార్మికులు చేస్తున్నారు. తమపైనా పనిఒత్తిడి తీవ్రంగా ఉందని ఇంజినీరింగ్ కార్మికులు వాపోతున్నారు.

భారం రెట్టింపు

కార్మికులు రోజు వారీగా చేసే పని కాకుండా, సైడు కాలువల ఆక్రమణల తొలగింపునకు సంబంధించి వారిపై అదనపు పని భారం పడింది. మట్టి చదును చేయటం, కాలువలను శుభ్రం చేయడం, మట్టి ఎత్తి పోయడం లాంటి పనులు పెరిగాయి. పండుగల సమయంలో ఆలయాల వద్ద, ఫంక్షన్ల సమయంలో ప్రైవేట్ గృహాల వద్ద పేరుకుపోయే చెత్త ఎక్కువగానే ఉంటుండటంతో పని భారం రెట్టింపు అవుతోంది.


ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

అత్తెసరు వేతనంతో సరి

ఇంజినీరింగ్ కార్మికులు 13 మంది నెలకు రూ.15 వేల అత్తెసరు జీతంతోనే పని చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించి కాంట్రాక్ట్ వర్కర్లకు రూ.21 వేలు ఇస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వేతనం అమలు కావడం లేదు. దీంతో పాటు సబ్బులు, బూట్లు, గ్లౌసులు సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

అమలకు నోచుకోని ఒప్పందాలు

సమ్మె కాలంలో ప్రభుత్వం పలు సమస్యలు పరిష్కారం చేస్తామని, ఒప్పందాలు చేసుకుంది. అయితే ఆ ఒప్పందాలు ఏమీ అమలు కావటం లేదు. 10 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లో బాగంగా రూ.75 వేలు ఇవ్వాలి. హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వడం లేదు. మట్టి ఖర్చులు పెంపుదల చేయలేదు.

పని భారం తగ్గించాలి



కార్మికులకు పని భారం ఎక్కువగా ఉంది. అవసరమైన మేర కార్మికులను నియమించడం ద్వారా పని భారం తగ్గించాలి. వేతనం పెంచడంతో పాటు, సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలి.

– డి.సుబ్బయ్య

వేతనం పెంచాలి

రోజులో పని సమయం కంటే ఎక్కువగానే విధుల్లో ఉంటున్నాం. జీతం మాత్రం రూ.15 వేలు ఇస్తున్నారు. పెరిగిన ధరలకు ఈ జీతం ఏ మాత్రం సరిపోవడం లేదు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. ఒప్పందం ప్రకారం వేతనం పెంచాలని కోరుతున్నాం.. లేదంటే అప్పులపాలవుతాం.

– అల్లాభక్షు

ఒప్పందాలు అమలు చేయాలి



కార్మికులు సమ్మె విరమించేందుకు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి. ఒప్పందాల అమలు ఊసే లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన ఒప్పందాలు అమలు చేయకుంటే పోరాటాల ద్వారా సాధించుకుంటాం.

– ఎం.రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

పేదల ప్లాట్లలో 'పెద్దోళ్ల' తీగలు!

- 33/11 కేవీ విద్యుత్ లైన్ అడ్డగోలుగా మార్పు
- టీడీపీ నేతల ప్లాట్లలో నుంచి తొలగించి మరో చోటకు..
- బాధితులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేత


ప్లాట్లలో వేస్తున్న విద్యుత్ స్తంభాలు చూపిస్తున్న బాధితులు

కంభం: పదిహేను సంవత్సరాల క్రితం కందులాపురం పంచాయతీ పరిధిలోని ఓ వెంచర్‌లో కొనుగోలు చేసిన ప్లాట్ల ముందు 33/11 కేవీ విద్యుత్ లైను వేస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతామని బాధితులు వాపోతున్నారు. సాదు రంగ నాయకులు, ఉప్పలపాటి తిరుపతిరెడ్డి, తొండమల్లె ప్రసాద్, బొర్రా నాగభూషణం, ఇంకా పలువురు మాట్లాడుతూ.. కందులాపురం ఇలాఖాలో 2009లో ప్లాట్లు కొనుగోలు చేశామని, ఆ సమయంలో మా ప్లాట్ల వద్ద ఎటువంటి విద్యుత్ లైన్లు లేవన్నారు. 15 సంవత్సరాల తర్వాత మా ప్లాట్లకు ఏ మాత్రం దగ్గరగా లేని, ఇతరుల స్థలాల్లో ఉన్న 33/11 కేవీ మెయిన్ లైనును అన్యాయంగా తమ ప్లాట్లలోకి చొచ్చుకొని వచ్చే విధంగా మార్పు చేయాలని చూడటం తగదన్నారు. ఇప్పటికే తమకు తెలియకుండా స్తంభాలు పాతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఈని అడిగితే తనకు తెలియదని చెప్పారని, ఏడీని అడిగితే తాను రాకముందే ఎస్టిమేషన్ ఇస్తే మంజూరైందని చెప్పారన్నారు. వెంచర్‌లో 14 అడుగుల రోడ్డు మాత్రమే ఉందని ఆ రోడ్లలో ఉండే తమ ప్లాట్లకు ముందు మెయిన్ లైను వేస్తే వాటిని అమ్ముకోలేమని, ఒక వేళ ఇళ్లు కట్టుకోవాలన్నా ఇబ్బందిగా ఉంటుందని వాపోయారు. అధికార పార్టీకి చెందిన నాయకు ప్లాట్ల మీద నుంచి వెళ్లే విద్యుత్ లైన్లను తమ ప్లాట్ల ముందుకు మార్చి నష్టం కలిగేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపివేసి ఎవరికీ ఇబ్బంది లేకుండా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ విషయమై విద్యుత్ ఏడీ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. తాను ఇటీవల బదిలీపై వచ్చానని, ఆ పనులకు సంబంధించి గతంలో ఎస్టిమేషన్ వేసి మంజూరు చేశారని తెలిపారు. కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిపివేశామన్నారు. రైతులకు, పేదలు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ముప్పతిప్పలు పెట్టే విద్యుత్ శాఖాధికారులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బడా బాబులకు ఏ పని కావాలన్నా క్షణాల్లో చేస్తున్నారని స్థానికంగా విమర్శలొస్తున్నాయి.

ఆటో స్టాండ్ అనుకుంటిరా..!


బస్టాండ్‌లో బస్సులకు అడ్డుగా నిలిపిన ఆటోలు

మార్కాపురం: ..చిత్రంలో కనిపిస్తున్నది ఆటో స్టాండ్ అనుకుంటే పొరపాటే.! ఇది మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్. కొందరు ఆటోవాలాలు ఏకంగా బస్టాండ్ లోపలికి వెళ్లి బస్సుల డోర్ వద్ద ఆటోలను నిలబెడుతుండటంతో ఆర్టీసీ డ్రైవర్లు, బస్సు దిగే, ఎక్కే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురం డిపోలోని 97 బస్సులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రోజూ సుమారు 50కి పైగా బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. వాటి సమయాలను గమనించి ఆటో డ్రైవర్లు నేరుగా తమ ఆటోలను బస్టాండ్ లోపలికి తీసుకెళ్తున్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఆటోలను పక్కకు తీయాలని చెబితే వాగ్వివాదానికి దిగుతున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించాలని ఆర్టీసీ డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. ఆటోవాలాలను అదుపు చేయలేక ట్రాఫిక్ కంట్రోలర్ కూడా చేతులెత్తేశారు. గట్టిగా ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని కంట్రోల్ చెబుతున్నారు. ఈ విషయమై మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులును వివరణ కోరగా.. ఆటో డ్రైవర్లు బస్టాండ్‌లోకి రావడంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆటోలు బస్టాండ్‌లో కనిపిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డుపైన పెట్టుకుని ప్రయాణికులను ఎక్కించుకుంటే అభ్యంతరం లేదని డీఎం స్పష్టం చేశారు.

జనవరి 18న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ పాఠశాలలో 2025 సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్షను జనవరి 18న ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్లను httpr://navodaya.gov.in/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ముందుకు కదలనంటున్న మురుగు నీరు


సబ్ స్టేషన్ రోడ్డులో సైడు కాలువల్లో నిల్వ ఉన్న మురుగు నీరు

పొదిలి: పట్టణంలోని సైడు కాలువల్లో మురుగు నీరు ముందుకు కదలటం లేదు. ప్రధాన రహదారితో పాటు, కాలేజీ రోడ్డులో ఆక్రమణ తొలగించడంతో చాలా వరకు కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో కాలువల్లో నీరు మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడిదక్కడ నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులు ఇబ్బందుల పాలవుతున్నారు. దుర్వాసనతో పాటు, దోమల బెడద ఎక్కువైందని ఆందోళన చెందుతున్నారు. పని ఎక్కువ కావటం, కార్మికులు తక్కువగా ఉండటంతో అన్ని ప్రాంతాల్లోనూ వారు పనులు చేయలేక పోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పంట కాదండోయ్..!


అలసంద పైరులో ఏపుగా పెరిగిన గురుగు మొక్కలు

కొనకనమిట్ల: ఈ చిత్రంలో కనిపిస్తున్నదంతా పైరు కాదు సుమా. పంట చేలో తెల్లటి పూలతో కనిపిస్తున్నవన్నీ ఓ రకమైన కలుపు మొక్కలు. కొనకనమిట్ల మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన ఓ రైతు 20 ఎకరాల్లో అలసంద, బొబ్బర్ల పంట సాగు చేశారు. పంట ఓ రకంగా ఉండటంతో సంతోషించిన ఆ రైతు ఆశలను కలుపు మొక్కలు క్రమక్రమంగా అడియాసలు చేశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చేను మొత్తం కలుపు మొక్కలతో నిండిపోయింది. వాటి మధ్యలో అక్కడక్కడా అలసంద, బొబ్బర్లు ఉండిపోయాయి. ఈ కలుపు మొక్కలను స్థానికంగా గురుగు అని పిలుస్తారు. విపరీతంగా పెరిగిన గురుగు మొక్కలతో పంట దిగుబడి పూర్తిగా పడిపోతుందని రైతు ఆందోళన చెందుతున్నారు. చుట్టుపక్కల పొలాల్లోనూ గురుగు దర్శనమిస్తోంది.

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



కోర్టు సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నాయకులు

- వామపక్షాల డిమాండ్

మార్కాపురం టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు సెంటరులో సీపీఐ, సీపీఎం, ఎంపీజే, వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. దేశంలో దళిత, గిరిజన, మైనార్టీ, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఏమాత్రం నోరు మెదపడంలేదని ఆరోపించారు. ప్రజల సంపదను, జాతి సంపదను, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టడాన్ని వారు ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, శ్రీను, సీపీఐ నాయకులు ఖాశీం, వెంకటరెడ్డి, రూబెన్, రాజు, కాశయ్య, నాగరాజు, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏడీజే శుభవాణి, పక్కన న్యాయవాదులు

మార్కాపురం: మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఒంగోలు స్మార్ట్ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధ్యక్షుడు భూపని కాశయ్య తెలిపారు. కళ్లు, బీపీ, సుగర్ వ్యాధులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి ప్రారంభించారు. అనంతరం పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నూతన అడ్వకేట్స్ డైరీ, క్యాలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్జిలు బి.దేవేందర్‌రెడ్డి, జె.కిశోర్ కుమార్, ఎం.బాలాజీ, బార్ అసోషియేషన్ కార్యదర్శి వై.అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు యు.రవీంద్రనాథ్, స్టాలిన్, చౌడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' సేవలు అభినందనీయం


నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న ఎస్సై, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: చేయూత మిత్రమండలి సేవలు అభినందనీయమని కంభం ఎస్సై నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక దర్గ రోడ్డులోని ధరణి ఐటీఐ కళాశాల సమీపంలో జరిగిన చేయూత మిత్రమండలి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. చేయూత సంస్థ పదేళ్లుగా సమాజ హితమైన సేవలందించడం అభినందనీయమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈనెల 14వ తేదీన చేయూత మిత్రమండలి ఆధ్వర్యంలో కంభం, బేస్తవారిపేట, తర్లుపాడు మండలాల్లో పదోవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు నగదు ప్రోత్సహకాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది పదవీ విరమణ చేసిన 20 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో చేయూత మిత్ర మండలి సభ్యులు దూదేకుల నబి, వెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రావు, ప్రసాద్, రామచంద్ర, సుబ్రమణ్యం, రవీంద్ర, ఖాశీంవలి, తిరుపతిరెడ్డి, రమేష్, నజీర్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన వైద్య సిబ్బంది


డీఎంహెచ్‌ఓతో ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్య బృందం

పొదిలి రూరల్: డీఎంహెచ్‌ఓగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లును ఒంగోలులోని కార్యాలయంలో సోమవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుగుణకుమార్, డాక్టర్ సుష్మ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి విష్ణు సహస్ర నామ పారాయణం


పూజలందుకుంటున్న షిరిడీ సాయిబాబా

మార్కాపురం: ధనుర్మాసం సందర్భంగా మంగళవారం నుంచి జనవరి 11వ తేదీ వరకు స్థానిక నెహ్రూ బజారులోని షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులతో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహిస్తున్నట్లు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. జనవరి 11వ తేదీ శనివారం లక్ష్మీనారాయణ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారాయణం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురికి, లక్కీ డిప్ పద్ధతిలో మరో ముగ్గురిని కలిపి మొత్తం ఆరుగురికి వెండి కాయిన్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు రామడుగు నాగ గోపి, కమిటీ సభ్యులు మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గ్రంథాలయ సందర్శన



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఓం సాయి వికాస్ విద్యానికేతన్ విద్యార్థులు ఫీల్డు విజిట్‌లో భాగంగా సోమవారం పట్టణంలోని శాఖాగ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు, ఉపయోగాలు, చరిత్ర తదితర వివరాలను గ్రంథపాలకులు జి.శివారెడ్డి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు రావాలని సూచించారు. విద్యార్థుల వెంట ప్రిన్సిపాల్ జి.రాధారాణి ఉన్నారు.